


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19 వ వసంతంలోకి ...


కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,12 జనవరి 2026 | 8 పేజీలు


## సంక్రాంతి అంటే 'సంబరమా'..
# 'కోడి రక్తపాతమా'?

వినోదం కాదు..
ఇది మూగ జీవాలపై క్రూరత్వం





పందెం కాస్తే జైలు శిక్షే..
చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరు..!

### పందెం రాయుళ్లపై కలెక్టర్ అపూర్వ భరత్ ఉక్కుపాదం
### - కోర్టు తీర్పుల వెనుక అసలు ఉద్దేశ్యం ఇదే !

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :**

తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి.పచ్చని పొలాలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, ఇంటిముందు రంగు రంగుల ముగ్గులు.. ఇవీ మన సంస్కృతికి ప్రతీకలు.కానీ దురదృష్టవ శాత్తూ, కాలక్రమేణా సంక్రాంతి అంటే కోడి కత్తుల యుద్ధం, వేల కోట్ల జూదం, మద్యం ఏరులై పారడంగా మారిపోతోంది.ఈ వికృత పోకడలకు అడ్డుకట్ట వేస్తూ, పండుగను పవిత్రంగా జరుపుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్ అపూర్వ భరత్, ఐఏఎస్ జారీ చేసిన తాజాఆదేశాలు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

**కోర్టు ఏమంటోంది? పందెం ఎందుకు నేరం?**

చాలామంది కోడి పందాలను 'సంప్రదాయం' అని సమర్థిస్తుంటారు.కానీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈ విషయంలో స్పష్టమైన దిశానిర్దేశం చేసింది. కేవలం వినోదంకోసం మూగజీవాలను హింసించడం సంస్కృతి కాదని కోర్టు స్పష్టం చేసింది.

– క్రూరత్వం సంప్రదాయం కాదు: 'జంతు క్రూరత్వ నిరోధక చట్టం –1960' ప్రకారం మూగజీవాల కాళ్లకు కత్తులు కట్టి, అవి ప్రాణాలు కోల్పోయే వరకు పోరాడటాన్ని చూడటం శిక్షార్హమైన నేరం.

– జూదం సామాజిక విపత్తు: సంక్రాంతి ముసుగులో జరిగే పందాల వల్ల కోట్లాది రూపాయల కష్టార్జితం చేతులు మారుతోంది.ఇది 'ఏపీ గేమింగ్ చట్టం–1974' ప్రకారం తీవ్రమైన ఉల్లంఘన.దీనివల్ల మధ్యతరగతి, పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

**రాజకీయ ముసుగులో లూటీ దారులు.. కలెక్టర్ 'స్ట్రాంగ్ వార్నింగ్' !**

పండుగ పేరుతో కొంతమంది రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు రహస్యంగా 'బరులు' ఏర్పాటుచేసి, సామాన్యులను జూదం వైపు ఆకర్షిస్తుంటారు. ఈసారి అలాంటి వారి పప్పులు ఉడకవని కలెక్టర్ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు..

**– స్థల యజమానులకు హెచ్చరిక:** పందాలు జరిగే స్థలం ప్రైవేట్ భూమి అయినా,పొలాలైనా సరే.. అక్కడ పందాలు జరిగితే ఆ భూ యజమానిని నేరుగా బాధ్యుడిని చేస్తూ క్రిమినల్ కేసులు

- తరువాయి 2లో..

## కేరళను తలదన్నేలా..కోనసీమ ముంగిట
# 'ఆత్రేయపురం' సంబరం !

### - గోదావరి తీరాన పర్యాటక విప్లవం
### - 'గంగ పూజ'తో వైభవంగా ప్రారంభమైన ఉత్సవాలు

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

పచ్చనిప్రకృతి,పలకరించే గోదావరి, నోరూరించే పూతరేకులు.. ఇవన్నీఒకెత్తయితే,ఇప్పుడు ఆత్రేయ పురం వేదికగా జరుగుతున్న 'పర్యాటక ఉత్సవం' మరో ఎత్తు ! కోనసీమ ప్రాంతాన్ని దక్షిణాది



పర్యాటక హబ్‌గామార్చే లక్ష్యంతో,కేరళబ్యాక్ వాటర్ టూరిజాన్ని తలదన్నేలా ఆత్రేయ పురం ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈసంబరాలకు తాడిపూడి వంతెనవద్ద ఎమ్మెల్యే బండారు సత్యా నందరావు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శ్రీకారం చుట్టారు.

**జలక్రీడల్లో జోరు.. ఈత పోటీల్లో హోరు!**

ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈత పోటీలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఐదేళ్ల చిన్నారుల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు కిలో మీటరు మేరఈతకొట్టిఅందరినీ ఆశ్చర్యపరిచారు.

- **మొత్తం ఈవెంట్లు: 18 రకాలు**
- **పాల్గొన్నవారు: 200 మందికి పైగా**

- తరువాయి 2లో..





# విజయవంతంగా ముగిసిన ఉచిత దంత వైద్య శిబిరం

- డా.దివ్యరాజ్ సేవలకు పవన్ కళ్యాణ్ ప్రశంస
- మొబైల్ దంత వాహనాన్ని ప్రారంభించిన పవన్ కళ్యాణ్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో పిఠాపురం నియోజవర్గ ప్రజలకు ఉచితంగా దంత వైద్య సేవలు అందించేందుకు జనసేన పార్టీ మహిళా నాయకురాలు డా.బుర్రాదివ్యరాజ్ ఏర్పాటుచేసిన ఉచిత దంత వైద్యశిబిరం విజయవంతంగా ముగిసింది. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 2న పిఠాపురం పట్టణంలో ఈకార్యక్రమానికి అంకురార్పణ జరగగా, మూడునెలలకు పైగా

- తరువాయి 2లో..

# సామాజిక సేవలో లిటిల్ స్టార్స్ ట్రస్ట్

**– ట్రస్ట్ చైర్మన్ టి.కరుణ్ రాజు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** మాదిగ సేవలో లిటిల్ స్టార్ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని ట్రస్ట్ చైర్మన్ టి.కరుణ్ రాజు అన్నారు. పిఠాపురం మండలం దొంతమూరు గ్రామంలో లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ద్వారా జరుగుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను గమనించిన విశాఖపట్నానికి చెందిన యస్.శివ, లక్ష్మీ ఫ్యామిలీ స్పందించి వృద్ధులకు రగ్గులు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ సంవత్సరం చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వృద్ధులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని, అటువంటి పరిస్థితుల్లో వారికి రక్షణగా ఈ రగ్గులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, భవిష్యత్తుల్లో కూడా ఇలాంటి మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చైర్మన్ కరుణ్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన యస్.శివ, లక్ష్మీ దంపతులకు ట్రస్ట్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరు ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షురాలు టి.రాధ, ట్రస్ట్ ట్రెజరర్ టి.షాలేమ్ రాజు, ట్రస్ట్ డైరెక్టర్ టి.బ్యూలాగ్రేస్, ఉమెన్ వెల్ఫేర్ గ్రూప్ ప్రెసిడెంట్ టి.కృపారాణి, బాబు స్టూడియో సూరిబాబు, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు

**రాజమండ్రి,మేజర్‌న్యూస్ :** స్థానిక దానవాయిపేటలోని ఆక్స్‌ఫర్డ్ ఒలంపియాడ్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు భోగి పళ్ళ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులతోపాటు చిన్నారుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని చిన్నారులకు భోగి పళ్ళుపోసి ఆశీర్వదించారు. భోగిమంటల కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయిని బృందం మరియు విద్యార్థులు చేసిన కోలాటం నృత్యం ఆకర్షణీయంగా నిలిచింది. విద్యార్థినీ విద్యార్థులు వారి నృత్య ప్రదర్శనలతో అందరిని అలరించారు. హరిదాసు కీర్తన, కోడిపందాలు, పిట్టలదొర, సోదేమ్మ, తెలుగుఅక్షరమాలతో ఏర్పరచిన బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఉషా మాధురి మాట్లాడుతూ సంక్రాంతి మన తెలుగువారి విశిష్ట పండగ అని ఇది రైతన్నల పండగ అని తెలిపారు. ఇటువంటి విశిష్ట కార్యక్రమాన్ని జరుపుటకు అవకాశం కలిగించిన చైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డికి అలాగే డైరెక్టర్ విజయ భాస్కర్ రెడ్డికి మరియు జోసెఫ్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉషా మాధురితోపాటు ఇన్చార్జిస్ జ్యోతి కిరణ్, సౌమ్య తదితర ఉపాధ్యాయుని ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# భాష్యం బృందావనంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** భారతదేశం సర్వమతాల, కులాల, వృత్తుల, జాతుల సమ్మేళనం. అందుకే మన దేశాన్ని కలగూరగంప అని అంటారు. అంతేకాదు మన దేశం సర్వ సంప్రదాయాలకు నిలయం. అందులో మన ఆంధ్రప్రదేశ్లో అతిపెద్ద పెద్దల పండుగ రైతుల పండుగ, భోగభాగ్యాలకు ఆహ్వానం పలికే పండుగ పెద్ద పండుగ. ఈ సంప్రదాయాలు, పండుగలు, ఆచారాలు అడుగంటిపోతున్న ఈ రోజుల్లో విద్యార్థిలోకానికి నాటితరం జ్ఞాపకాలను, సంప్రదాయాలను అందించాలనే సదుద్దేశంతో భాష్యం స్కూల్లో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలు అంబరాన్ని అంటేలా విద్యార్థులంతా వివిధ వేషధారణలో వచ్చి అలరించారు. పాఠశాల వాతావరణం రంగులమయంగా పల్లె వాతావరణంతో ఆహ్లాదపరిచారు. ఈ వినోదాత్మక వాతావరణంలో అనేకమంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ సూర్య మరియు శిరీషలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ జోనల్ ఇంచార్జ్ వి.గోవిందరాజు విద్యార్థులకు, తల్లిదండ్రులకు ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.



# విజయవంతంగా ముగిసిన ఉచిత దంత వైద్య శిబిరం

మొదటిపేజి తరువాయి

పిఠాపురం నియోజకవర్గం అంతా దశలవారీగా అమలు చేయడం జరిగింది.కాగా, ఈనెల 10న కాకినాడలో పర్యటించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డా.బుర్ర దివ్యరాజ్ ద్వారా వైద్య శిబిరం వివరాలు అడిగి తెలుసుకుని అభినందించడంతో పాటు, రంగరాయ వైద్య కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వృద్ధులకు రూ.40 వేలు విలువైన ఉచిత కొత్త పళ్ళ సెట్లు, పాఠశాల విద్యార్థులకు డెంటల్ కిట్లను అందించారు, అనంతరం పిఠాపురం ప్రజలకు నిరంతరం ఉచితంగా దంత వైద్యసేవలు అందించేందుకు డా. దివ్యరాజ్ ఏర్పాటుచేసిన మొబైల్ దంత వాహనాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు, అనంతరం మెగా డెంటల్ సర్వే&క్యాంప్ ముగింపు పోస్టర్‌తోపాటు మెగా క్యాన్సర్ సర్వే పోస్టర్‌ను పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా డా. బుర్రా దివ్యరాజ్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో పిఠాపురం ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని, పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పరిష్కరించుకొని పిఠాపురం నియోజకవర్గంలో మూడు నెలలపాటు 25 వేల కుటుంబాలు, 35 ప్రభుత్వ పాఠశాలల్లో సర్వే చేయడంతోపాటు 6 వేల మందికి 2 కోట్లు విలువైన దంత వైద్యసేవలు ఉచితంగా అందించామని తెలిపారు. జీఎస్ఎల్ ఆసుపత్రి, నియో, షీ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన దంత వైద్య శిబిరం విజయవంతంగా ముగియడం ఆనందంగా ఉందని, ఇదే స్ఫూర్తితో పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు నిరంతరం దంత వైద్యసేవలు అందించేందుకు మొబైల్ దంత వాహనాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, త్వరలో పిఠాపురం నియోజకవర్గంలో మెగా క్యాన్సర్ సర్వే నిర్వహిస్తున్నట్లు డా. దివ్యరాజ్ తెలిపారు.

# సంక్రాంతి అంటే 'సంబరమా'... 'కోడి రక్తపాతమా'?

మొదటిపేజి తరువాయి

నమోదు చేస్తారు.

**– నిరంతర నిఘా:** జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీమ్స్ ఇప్పటికే క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగాయి. పందెం కాసేవారే కాదు, నిర్వాహకులు, మద్యం సరఫరా చేసేవారు,చివరికి పందెం చూడటానికి వెళ్లేవారిపై కూడా నిఘా ఉంటుంది.

**– సెక్షన్ 163 (బిఎన్ఎస్ఎస్) అమలు:** శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, 2023లోని సెక్షన్ 163 ప్రకారం ఇప్పటికే నిషేధాజ్ఞలు అమలులోకి వచ్చాయి.

**కలెక్టర్ ఆశయం:** 'రక్తం లేని పండుగ – ఆనందాల నిలయం'

**"పండుగ అంటే ప్రాణాలు తీయడం కాదు..** ప్రాణం పోయడం" అన్నదే జిల్లా యంత్రాంగం నినాదం. సంప్రదాయాన్ని గౌరవించే వారు కోడి పందాలకు బదులుగా ఈ క్రింది కార్యక్రమాల్లో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు:**– ముగ్గుల పోటీలు మరియు గాలిపటాల పండుగ.– స్థానిక గ్రామీణ క్రీడలు కబడ్డీ, వాలీబాల్, బంతి ఆటలు– తెలుగు సంస్కృతిని చాటిచెప్పే సాంస్కృతిక ప్రదర్శనలు.**చట్టం తన పని తాను చేసుకుపోతుంది, పోలీసు యంత్రాంగం నిఘా పెడుతుంది. కానీ అసలైన మార్పు ప్రజల్లో రావాలి.పందెం రాయుళ్ల ఉచ్చులో పడి కష్టార్జితాన్ని పోగొట్టుకోకుండా,ఆసొమ్మును పిల్లల చదువులకు, భవిష్యత్తుకు వాడుకోవడమే నిజమైన సంక్రాంతి.సంక్రాంతి సంబరాల్లో రక్తం చిందించవద్దు.. ఆనందాన్ని పంచుదాం. "సాంప్రదాయ సంక్రాంతి ముద్దు – కోడి పందాలు వద్దు".. ఇదే ప్రజలందరి నినాదంగా మారాలన్నది జిల్లా కలెక్టర్ భరత్ ప్రజల్లో కోరుకునే మార్పు... ఇది జిల్లా యంత్రాంగం వల్ల అవుతుందో లేదో వేచి చూద్దాం..

# కేరళను తలదన్నేలా..కోనసీమ ముంగిట 'ఆత్రేయపురం' సంబరం!

మొదటిపేజి తరువాయి



ప్రత్యేకత:60ఏళ్లు పైబడిన మహిళలు, పురుషులు మరియు పోలీస్‌శాఖ సిబ్బంది సైతం పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

– బహుమతులు: 54 మంది విజేతలకు నగదు, మెడల్స్, ట్రోఫీలతో ఘనంగా సత్కరించారు.

**లక్ష్యం – అంతర్జాతీయ పర్యాటక స్థాయి!..** కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, కేవలం మూడు రోజుల వేడుకలతోనే ఆగిపోకుండా, ఆత్రేయపురంలో శాశ్వత రిసార్టులు, టూరిజం వసతులు కల్పిస్తామని ప్రకటించారు."లొల్ల లాకుల వద్ద ప్రతి ఆదివారం టూరిజం కార్యక్రమాలు నిర్వహించి, స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే మా లక్ష్యం. మన వంటలకు ప్రపంచ మార్కెట్ కల్పించడంతో పాటు, ఎంఎస్ఎంఈ పథకాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తాం."అని బండారు సత్యనారాయణ రావు స్పష్టం చేశారు.

**కళాకారుల సందడి.. సినీ గ్లామర్!..** ఈ ఉత్సవాలకు మరింత వన్నె తెచ్చేలా, సోమ, మంగళవారాల్లో డ్రాగన్ పడవల పోటీలు నిర్వహించనున్నారు. సాయంత్రం వేళల్లో మహాత్మా గాంధీ కళాశాల ప్రాంగణం సినీ ఆర్కెస్ట్రాతో హోరెత్తనుంది. ముఖ్యంగా, హీరో శర్వానంద్ నటించిన 'నారీ నారీ నడుమ మురారి' చిత్ర ప్రీ-లాంచ్ వేడుకలు ఇక్కడ జరగడం పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

**పాలనా దక్షత – ప్రజల హర్షం..** కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డీవో పి.శ్రీకర్ తదితర ఉన్నతాధికారులు పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు సాఫీగా సాగుతున్నాయి. అధికారుల సమన్వయం, ప్రజాప్రతినిధుల సంకల్పం వెరసి.. సంక్రాంతికి మూడు రోజుల ముందే ఆత్రేయపురం ముంగిట పండుగ వెలుగులు వచ్చాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తపేట జనసేన ఇన్చార్జి బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నల్లరాయి క్వారీ ముసుగులో ఎర్ర మట్టి రవాణా





**– అడ్డుకున్న ఓజుబంద ఆదివాసి ప్రజలు**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో మైనింగ్ మాఫియాతో మైనింగ్ డిపార్ట్మెంట్ లింకులు లింకులు పెట్టుకుని అక్రమాలకు పాల్పడుతుందని ఆదివాసి సంక్షేమ పరిషత్ ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు తప్పుడు నివేదికలతో కప్పి పుచ్చడంపై పలువురు మండిపడుతున్నారు. పోలవరం జిల్లా గంగవరం మండలం ఒజుబంద గ్రామంలో గల నల్లరాయి క్వారీల ముసుగులు గ్రావెల మట్టి అక్రమ రవాణా జరుగుతుంది. ఇది తెలుసుకున్న ప్రజలు అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ లోడ్ లారీలను అడ్డుకొని నిరసన తెలియజేయడం జరిగింది. ఇప్పటికే నల్లరాయి క్వారీల తోటి అనేక ఇబ్బందులు పడుతున్నామని, రోడ్లు పాడవుతున్నాయి, పంట పొలాలు నాశనం అవుతున్నాయి, ఇల్లు బీటలు వారుతున్నాయి, ఆరోగ్యాలు పాడవుతున్నాయి, అడవి అంతరించిపోతుంది వీటన్నిటిపై పిఓ గారికి కలెక్టర్ గారికి మైనింగ్ డిపార్ట్మెంట్ వారికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోగా మైనింగ్ డిపార్ట్మెంట్ వారు క్వారీ నిర్వాహకులకు కొమ్ము కాస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తపరిచారు. తక్షణమే అధికారులు స్పందించి క్వారీలను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ప్రకటన ద్వారా మాట్లాడుతూ ఓజబందులో గల నల్లరాయి క్వారీలపై ప్రజలు ఆదివాసి సంక్షేమ పరిషత్ ఉన్నతస్థాయి అధికారులు కూడా ఫిర్యాదు చేసి ఉన్నామని, అయితే దీనిపై మైనింగ్ ఏడికి క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా ప్రజలతో మాట్లాడకుండా తానొక్కరే టూరిస్ట్ లాగ వచ్చి క్వారీ దగ్గర ఫోటో తీసుకుని సైలెన్స్‌గా వెల్లిపోయారని ఆయన మండిపడ్డారు. ఆ ఫోటో పెట్టి స్థానికంగా అంత బాగానే ఉంది ఎటువంటి ఇబ్బంది లేదంటూ ఉన్నత అధికారులకు తప్పుడు నివేదికలు అందజేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మైనింగ్ ఏడి వలన ఏజెన్సీలో మైనింగ్ మాఫియా రెచ్చిపోతుందని అతనిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రంప ఏజెన్సీ ప్రాంతంలో విచ్చలవిడిగా మైనింగ్ మాఫియా రెచ్చిపోవడానికి కారణం మైనింగ్ ఏడి అస్తమేనని ఆయన ఆరోపించారు. రంపచోడవరం మండలం నరసాపురంలో గల నల్లరాయి క్వారీలపై కూడా ఇలాగే తప్పుడు నివేదికలు ఇస్తూ మైనింగ్ మాఫియాని పెంచి పోషిస్తూ నష్టపోతున్న రెండు గ్రామాల ప్రజలకు అన్యాయం చేస్తూ వస్తున్నారని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు.

వీటన్నిటి పై పలుమార్లు కలెక్టర్ ఐటిడిఏ గ్రీవెన్స్‌లలో ఫిర్యాదు చేస్తున్నప్పటికీ పాత చింతకాయ పచ్చడి లాగానే ఇచ్చిన రిపోర్ట్‌ని తిరిగి ఇస్తూ కాలం గడిపేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రంప నియోజకవర్గంలో నడుస్తున్న అక్రమ మైనింగ్ పై ఉక్కుపాదం మోపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలకు అండగా అక్రమ మైనింగ్ మూసివేసే వరకు ఆదివాసి సంక్షేమ పరిషత్ ఉద్యమాన్ని కొనసాగిస్తుందని, తప్పుడు కేసులు పెట్టిస్తూ, ఫిర్యాదుదారులను బెదిరింపులకు గురిచేస్తు దాడులు చేస్తున్నటువంటి మైనింగ్ మాఫియాకు, మైనింగ్ డిపార్ట్మెంట్ అధికారులకు, దీని వెనక ఉన్న రాజకీయ నాయకులకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని ఆయన హెచ్చరించారు. ఈ విషయంపై సోమవారం నాడు ఐటిడిఏ ముట్టడి చేపడతామని ఆయన తెలియజేశారు.

# ముగిసిన పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు



**– చివరి రోజు సంబరాల్లో పాల్గొన్న సినీ దర్శకులు హరీష్ శంకర్, సినీ నటుడు నవీన్ పోలిశెట్టి**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం ఆర్ఆర్బీహెచ్ఆర్ కళాశాల మైదానంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రారంభమైన మూడు రోజుల నిపీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు ముగిసాయి. చివరి రోజైన ఆదివారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో స్థానిక అంగన్వాడీ చిన్నారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సంక్రాంతి సంబరాల ముగింపు వేడుకలకు సినీ దర్శకుడు హరీష్ శంకర్, సినీ నటుడు నవీన్ పోలిశెట్టి, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, డీఆర్వో వెంకటరావు, జెడ్పీ సీఈవో, ఇన్చార్జి జిల్లా పర్యటక అధికారి వీవీఎస్.లక్ష్మణరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, కె.శ్రీరమణి, పాడా పీడీ ఎ.శ్రీనివాసరావు, డ్వామా పిడి ఎ.వెంకటలక్ష్మి, తదితర అధికారులు హాజరై కళా ప్రదర్శనలు తిలకించారు. తెలుగు సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పిఠాపురంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాలకు ప్రత్యేకంగా ఆహ్వానించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు... హరీష్ శంకర్, నవీన్ పోలిశెట్టి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వివిధ జిల్లాలకు చెందిన ప్రసిద్ధ జానపద కళారూపాల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన స్వాతి ఆర్కెస్ట్రా తదితర కార్యక్రమాలతో పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా వివిధ కళా ప్రదర్శనలు చేసిన కళాకారులను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్ మల్లికార్జునరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, రాజమండ్రి విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శర్మ, సమాచార పౌర సంబంధాల శాఖ ఏఈఐఈ సీ.బాబురావు, డీసీవో బి.శ్రీనివాసరెడ్డి, సెట్రాజ్ సీఈవో కాశీవిశ్వేశ్వరరావు, అసిస్టెంట్ టూరిజం అధికారి వి.త్రిమూర్తులు, ఇతర శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం

**– సంక్రాంతి కానుకగా 3.10 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించే ఆర్&బి రోడ్లకు శంకుస్థాపన**

**– 38 లక్షల రూపాయలతో మడికి నుండి మెర్నిపాడు వరకు రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం**

**– నియోజకవర్గంలో వాడవాడలా అభివృద్ధి పనులు**

**– గ్రామాల అభివృద్ధి తన ధ్యేయమన్న ఎమ్మెల్యే గోరంట్ల**



**రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ :** గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఆర్ అండ్ బి శాఖ వారి ఆధ్వర్యంలో కడియం నుండి జేగురుపాడు వరకు సిసి మరియు బిటి రోడ్డు, కడియపులంక నుండి వీరవరం వయా పొట్టిలంక సిసి రోడ్డుకు అడిషనల్ ప్లాన్ నుండి 3.10 కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయిన సందర్భంగా పొట్టిలంక, కడియపుసావరం గ్రామాలలో నూతన రోడ్లు నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. అలాగే మడికి నుండి మర్నిపాడు వరకు వయా దుళ్ల 38 లక్షల రూపాయలు రోడ్డు మరమ్మతులకు మంజూరైన సందర్భంగా దుళ్ల గ్రామంలో మరమ్మత్తుల పనులను ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రారంభించారు. కడియపుసావరం గ్రామంలో సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో రూరల్ నియోజకవర్గంలో వాడవాడలా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ఈరోజు 3.48 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించేందుకు శంకుస్థాపన చేశామని, కడియం నుండి వెలగతోడు వరకు వెళ్లే ప్రధాన రహదారి నూతన నిర్మాణం చేసేందుకు 6.50 కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని, టెండర్ అయిన వెంటనే త్వరలోనే పనులు మొదలు పెడతామని తెలిపారు.

గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల రాష్ట్రంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూడా, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, వైస్ ఎంపీపీలు పంతం గణపతి, కలిదిండి గోవింద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాన్ని సత్యనారాయణ, సర్పంచులు అన్నందేవుల చంటి, వెంకటేశ్వరరావు, గట్టి సుబ్బారావు, చెల్లుబోయిన శ్రీనివాస్, ప్రత్తిపాటి రామారావు చౌదరి, వాసిరెడ్డి బాబి, కొత్తపల్లి శ్రీరామ్, గుర్రపు సత్యనారాయణ, నాగిరెడ్డి రామకృష్ణ, వట్టికూటి దత్తుడు, తూము శ్రీను, సూరపురెడ్డి భరత్, చిట్టూరి అమ్మిరాజు, ముమ్మిడి నాగేశ్వరరావు, గుత్తుల హరిప్రసాద్, వరగోగుల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రుద్రయ్య, మర్రెడ్డి రమేష్, కంటిపూడి శ్రీను, శీలం రవి, కలిదిండి సత్యనారాయణ, కాయల సత్యనారాయణ, మల్లు శివ, డి.ఈ సాయి సతీష్, ఎమ్మార్వో సునీల్, ఎంపీడీవో రమేష్, జే.ఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీతి దినపత్రిక సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# భారతీయ సంస్కృతిలో అంతర్భాగం రంగవల్లులు





- రంగురంగుల ముగ్గులతో పండుగ సంబరాలకు ప్రత్యేక శోభ
- పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు
- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** సంక్రాంతి అంటే మొదటగా గుర్తుకు వచ్చేది రంగవల్లులు, గొబ్బెమ్మలేనని, పల్లెల్లో సంక్రాంతి పనులు మొదలు అయ్యేది కూడా నెల ముగ్గు పెట్టడంతోటే అని, రంగవల్లులు భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు పేర్కొన్నారు. ఆత్రేయపురం ఉత్సవం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలను ఏపీ సృజనాత్మక సంస్కృతి సమితి చైర్మన్ పొడపాటి తేజస్విని, యువ నాయకుడు బండారు సంజీవ్ లతో కల్సి ఆయన ప్రారంభించారు. వివిధ వర్ణాలతో మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులను ఆయన పరిశీలించారు. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి, పండుగ సంబరాలకు ప్రత్యేక శోభను చేకూర్చడానికి, తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయడానికి ముగ్గుల పోటీలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మొత్తం 243 మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ. 20వేలు వైజాగ్ చెందిన కె. లత, రెండవ బహుమతి రూ. 10వేలు రాజమండ్రికి చెందిన పి. ఆదిశ్రీ, మూడవ బహుమతిగా రూ. 5 వేలు ఉచ్చిలికి చెందిన జ్యోత్స్నప్రియ లకు ఎమ్మెల్యే అందజేశారు. మరో పదిమందికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. పోటీలో పాల్గొన్న మహిళలందరినీ అభినందించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

- 50 మందికి 25 లక్షల రూపాయలు అందజేసిన ప్రభుత్వ విప్ యనమల దివ్య

**అన్నవరం/తుని, మేజర్ న్యూస్ :** పేద ప్రజల కష్టాల్లో పాలు పంచుకుని వారిని కడగండ్లు నుంచి గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిరతంరం శ్రమిస్తుందని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య అన్నారు. ఆదివారం తేటగుంట క్యాంప్ కార్యాలయంలో సీనియర్ నేత యనమల రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తుని, కోటనందూరు, తొండంగి మండలాలకు చెందిన 50 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద 25 లక్షల రూపాయల విలువ చేసే చెక్కులను ప్రభుత్వ విఫ్ యనమల దివ్య అందజేసారు. ఈసందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్నవారి వైద్య ఖర్చులు నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద గతంలో ఎన్నడూ లేని విధంగా విరివిగా ఆర్థిక సాయం అందిస్తున్న ఘనత కూటమికే దక్కుతుందన్నారు. పేదలను ఆదుకోవడంలో ఎలాంటి వివక్షత చూపకుండా సహాయక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల



అధ్యక్షులు చింతంనీడి అబ్బాయి, చొక్కా అప్పారావు, పోతల సూరి బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్, గాడి రాజబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల దుప్పట్ల పంపిణీ కార్యక్రమం






**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళ డిగ్రీ మరియు పి.జీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విద్యార్థినులు రోడ్డు పక్కన ఉండే అనాదలకు దుప్పట్ల పంపిణీ కార్యమ్రం నిర్వహించారని ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ ఎమ్.శ్రీనువాసరావు తెలిపారు.

ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జీ కళాశాలల అకడమిక్ డైరక్టర్ డా॥ బి.యి.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడం మనందరి బాధ్యత అని, ఇలాంటి కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించాలని తెలిపారు. ఆదిత్య మహిళ డిగ్రీ మరియు పి.జీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం చలి కాలంలో ఇటువంటి సేవ కార్యక్రమాలు నిర్వహించడం తమ సంస్థ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. సమాజంలో మన చుట్టూ ఉన్న పేద ప్రజలు ఆకలి, చలి బాధలను తీర్చడం మన సామాజిక బాధ్యత అని తెలియజేశారు. ఆదిత్య మహిళ డిగ్రీ మరియు పిజీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ తీవ్రమైన చలి కారణంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఆసరాగా నిలిచిన విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నవ్య మరియు అధిక సంఖ్యలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని రధ సేవ



**అన్నవరం, మేజర్ న్యూస్ :** శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శ్రీ సత్యదేవుని రధ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకముల సుగంధభరితమైన పుష్పములతో అలంకరించి రధ వాహనంపై ఆశీనులు గావించి వేదపండితుల మంత్రోచ్చరణ, మంగళ, వాయిద్యాల నడుమ ఆలయ చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. ఈ రధ సేవ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, అర్చకులు, దేవస్థానం సూపరెంటెంట్, దేవస్థాన అధికారులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేరూరులో విషాదం

- మంచినీటి చెరువులో జారిపడ్డ చిన్నారులు..ఒకరి మృతి



**అమలాపురం, మేజర్ న్యూస్ :** అమలా పురం మండలం పేరూరు హై స్కూల్ దగ్గర్లో గల మంచినీటి చెరువు వద్ద గాలిపటం ఎగరవేస్తూ చెరువులో పడ్డ నందుల మోక్ష తమ్ముడు తిలక్..ప్రమాదవ సాత్తు మంచినీటి చెరువులో జరిపడ్డారు. తమ్ముడు తిలక్ బయట పడినప్పటికీ 9 సంవత్సరాల మోక్ష గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న సర్పంచ్ దాసరి అరుణ డేవిడ్ పోలీసులకు అధికారులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఎన్‌డిఆర్‌ఎఫ్ గాలింపు చర్యలు చేపట్టాగా అప్పటికే మృతి చెందిన మెక్షా మృతదేహం లభించడంతో ఒక్కసారిగా గ్రామంలో విషాదం నెలకొంది.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి సన్నిధిలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబురాజు

- ప్రత్యేక పూజలు



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు ప్రసిద్ది చెందిన శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని ఆదివారం పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ మరియు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ పర్యవేక్షణలో వేదపండితులు అమ్మవారి దర్శనం కల్పించి, వేద ఆశీర్వచనాలు అందజేసి, అనంతరం ప్రసాదం అందజేశారు.

ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, దేవస్థాన సిబ్బంది, తదితరులు ఉన్నారు. దీనిలో భాగంగా అసిస్టెంట్ కమీషనర్ విజయలక్ష్మి అమ్మవారి చిత్రపటాన్ని రాజా సూరిబాబు రాజుకు అందజేశారు.

# శాశ్వత ప్రాతిపదికన బోరు బావి నుండి గ్యాస్ లీకేజ్ కాకుండా క్యాపింగు





**– కలెక్టర్ మహేష్ కుమార్**

**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఇరుసమండ గ్రామంలో ఓఎన్‌జీసీ బోరుబావి నుండి వ్యాపించిన అగ్నికీలలను క్రైసెస్ మేనేజ్మెంట్ బృందం 5 రోజులపాటు నిర్విరామంగా శ్రమించి శనివారం సాయంత్రానికి మంటలను పూర్తిగా అదుపులోనికి తెచ్చి శాశ్వత ప్రాతిపదికన బోరు బావి నుండి గ్యాస్ లీకేజ్ కాకుండా క్యాపింగు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేతో జిల్లా ఎస్పీ ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులతో కలిసి క్యాపింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఈనెల 5వ తేదీన ఓఎన్‌జీసీ మోరి 5 గ్యాస్ బావి నుండి ముందుగా గ్యాస్ తదుపరి మంటలు వ్యాపించి చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతులకు గురి అయ్యారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇరుసుమండ లక్కవరం గుబ్బలవారిపాలెం, చింతపల్లి గ్రామాల ప్రజలు ఈ యొక్క క్రైసెస్ మేనేజ్మెంట్‌లో ప్రభుత్వం యంత్రాంగానికి ఎంతగానో సహకరించడం వల్ల పెద్దగా తాత్కాలిక సహాయ పునరావాస కార్యక్రమాలలో ఇబ్బందులు ఏమి రాలేదని, పూర్తి సంయమనంతో వ్యవహరించారని అభినంది ంచారు. స్థానిక ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాదు లు పూర్తిగా బాధితులకు దగ్గరుండి సహాయ సహకారాలు అందించడం సంతోషదాయకమన్నారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి రావడంతో మట్టితో బోరుబావిని శాశ్వత ప్రాతిపదికన నింపడం జరిగిందని, ప్రజలు ఎటువంటి ఆందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా జీవనాన్ని గడపాలని సూచించారు. బోరుబావి పూర్తిగా మట్టితో శాశ్వతంగా మూసివేయడంతో ఈ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారన్నారు. జిల్లా యంత్రాంగం అన్నివేళలా ప్రజానీకానికి అండగా నిలుస్తుందన్నారు. ఈ నాలుగు గ్రామాల ప్రజలకు ఎక్స్‌గ్రేషియా అందించడం జరుగుతుందని, వ్యవ సాయ ఉద్యాన పంటల నష్టాలపై గణాంకాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాల వారికి బీమా పథకాలు వర్తింపజే యనున్నట్లు తెలిపారు. త్వరలో జిల్లా క్రైసేస్ మేనేజ్మెంట్ కమిటీని నియమించడం జరుగుతుందని ఇకపై ఈ కమిటీ నివేదిక ఆధారంగా విపత్తులకు సంబంధించిన పరిహారాలు బాధితులకు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. స్థానిక పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్, స్థానిక శాసన సభ్యులు దేవవరప్రసాదు లు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ప్రాంతాన్ని ఏరియల్ సర్వే చేసి జరిగిన నష్టపరిహారం గురించి అడిగి తెలుసుకున్నారన్నారు. బాధిత కుటుంబాలను ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా అన్ని విధాల ఆదుకో వడం జరుగుతుందన్నారు. ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులు బాధిత కుటుంబాలకు పరిహారాలు సకాలంలో అందించేందుకు ముందుకు రావాలన్నారు. ఇకపై ఓఎన్‌జీసీ కార్యకలాపాలు నిర్వహించే చోట ముందుగా సమాచారం ఆయా ప్రాంత వాసులకు 5 కిలోమీటర్ల పరిధిలో తప్పనిసరిగా తెలియజేసి ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని ఓఎన్‌జీసీ ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాహుల్ మీనా, ఆర్డిఓ కే.మాధవి, ఓఎన్‌జీసీ ప్రతినిధులు విక్రమ్ సక్సేనా, శాంతానో దాసు, బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్



సామర్లకోట, మేజర్ న్యూస్ : సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని సామర్లకోట సత్యనారాయణపురం చెందిన యువత ఆదివారం ఎస్ఎన్‌పి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో నాలుగు జట్లు పాల్గొనగా పోటీలు హెూరాహెూరీగా జరిగాయి.

ఈ పోటీల్లో తేజ సూపర్ కింగ్స్, ఎస్ఎన్‌పి ఇండియన్స్ జట్టు ఫైనల్‌లో పోటీ పడగా విజేతగా ఎస్ ఎన్ పి ఇండియన్స్ జట్టు నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు ముఖ్య అతిథులు : బీజేపి సీనియర్ నాయకులు డాక్టర్ గొరకపూడి చిన్నయ్య దొర, వార్డు కౌన్సిలర్ సేపేని సురేష్, పడాల వీరబాబులు విజేతలకు బహుమతులను అందజేశారు.

# సిబ్బందిని పెంచి పారిశుద్ధ్యం మెరుగుపరచండి



**– మీరు చీపురు పట్టి తుడవాల్సిన పనిలేదు**

**– ఏఐటియుసి నాయకులు సాకా రామకృష్ణ**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చీపురు పెట్టి తుడవాల్సిన అవసరం లేదని, పిఠాపురం మున్సిపాలిటీలో సిబ్బందిని పెంచి పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచాలని ఏఐటియుసి నాయకులు సాకా రామకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ముందస్తు సంక్రాంతి సంబరాల సందర్భంగా పిఠాపురంలో పర్యటించిన స్థానిక శాసనసభ్యులు, ఏపి డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ మోహం నగర్‌లో పారిశుద్ధ్యం బాగాలేదని, నేను చీపురుతో ఊడవాల అంటూ వ్యాఖ్యానించారని, తగిన సిబ్బంది ఉన్నారా...? లేరా...? పక్కనే ఉన్న కమిషనర్‌ను ఎందుకు ప్రశ్నించలేదని, కమీషనర్ సైతం సిబ్బంది కొరత గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. సిబ్బంది కొరత ఉందని, కార్మికుల మీద పని భారం పడుతుందని, సిబ్బంది పెంచండి అని ఏళ్ల తరబడి అధికారులకు మొఱ పెట్టుకున్నా... అధికారులుగాని ప్రభుత్వాలు గాని పట్టించు కోలేదని, సమస్యలు తెలుసుకోకుండా ఈ రోజు పారిశుద్ధ్యం బాగోలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన మండ్డిపడ్డారు. చనిపోయి వారు చనిపోయినట్టు గానే ఖాళీలు వున్నాయని, రిటైర్మెంట్ అయిన వారి స్థానంలో పోస్టుల నియామకాలు జరగలేదని, దశలవారిగా పోరాడుతున్నా... అధికారులు పట్టించుకో లేదని, సిబ్బంది లేకుండా పారిశుద్ధ్యం ఎలా మెరుగుపడుతుందని ప్రశ్నించారు.

# నలుగురు పేకాటరాయుళ్ళ అరెస్టు



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలం, చదలాడ, ఉలమేశ్వరం రోడ్డులో పేకాట ఆడుతున్న నలుగురు పేకాట రాయుళ్ళను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.5210/- స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.మౌనిక తెలిపారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాల పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేటలో జనవరి 12న సోమవారం కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన సంక్రాంతి సంబరాల పనులను ఆదివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పర్యవేక్షించారు. అధికారులను పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావుతో ట్రాఫిక్ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్‌ను మళ్ళించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేకి ఎస్సై ట్రాఫిక్ ఆంక్షలు ఎమ్మెల్యేకి వివరించారు. ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించే వారిమని తరువాత వైసిపి ప్రభుత్వం సంక్రాంతి సంబరాలు నిర్వహించడం మర్చిపోయిందని మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండో సంవత్సరం కూడా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నామని అధికారులను అన్ని రకాలుగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భారత్, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, ఉప్పలపాటి బుల్లబ్బు, దాపర్తి సీతారామయ్య, సిడిపిఓ పూర్ణిమ, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం ఎంపీడీవోలు, అధికారులు, కుటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నాగబాబును కలిసిన జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్



**జగ్గంపేట,మేజర్‌న్యూస్:** జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, శాసన మండలి సభ్యులు కొణిదల నాగబాబును జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా జిఆర్‌టి గ్రాండ్ హెూటల్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాల గురించి నాగబాబుకి తెలియచేసారు. మూడు రోజులు పాటు కాకినాడ జిల్లాలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొన్న సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయన్నారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, రామ్ లక్ష్మణ్, ఎలుగంటి రామకృష్ణ, పాలెం బాబీ, కాయల మణికంత, అడ్డూరి పద్మరాజు, గోకేడ పండు, గంధం వంశీ తదితరులు పాల్గొన్నారు.

# లొల్ల లాకుల వద్ద ఫుడ్ ఫెస్టివల్





**– ప్రారంభించిన ఏపీ సృజనాత్మక సంస్కృతి చైర్మన్ తేజస్విని, ఎమ్మెల్యే సత్యానందరావు**

**– లొల్ల లాకుల వద్ద స్పీడ్ బోట్‌ను నడిపిన జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :**ఆత్రేయపురం ఉత్సవాల సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. లొల్ల లాకుల వద్ద జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ స్వయంగా స్పీడ్ బోట్ నడిపి అందరినీ అలరింపజేశారు. లొల్ల లాకుల వద్ద ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఆర్డీవో పి.శ్రీకర్, ఎస్పీ రాహుల్ మీనా తదితరులతో కలిసి ప్రారంభించారు. ఏపీ సృజనాత్మక సంస్కృతి చైర్మన్ పొడపాటి తేజస్విని ఫుడ్ ఫెస్టివల్ ను సందర్శించి స్టాళ్లను పరిశీలించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆమెకు స్థానిక రుచుల గురించి వివరించారు.

పూతరేకులకు పుట్టినిల్లు ఆత్రేయపురమని, తాపేశ్వరం కాజాలు, ఆత్రేయపురం మామిడి తాండ్ర, నార్కెడిమిల్లి పచ్చళ్ళు, కోవా, నగరం గరాజీలు మొదలైన కోనసీమ సాంప్రదాయ వంటకాలతో ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్టివల్ నోరూరించేలా ఉందని ఈ సందర్భంగా వారు వ్యాఖ్యానించారు. స్థానిక రుచులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత కల్పించడం ద్వారా ఇక్కడి మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని, పర్యాటకంగా ఈప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అన్నారు.

# శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం




**– పాల్గొన్న భక్తులు**

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.


# ఆత్రేయపురంలో 'నారి నారి నడుమ మురారి' హంగామా





**గోదావరి తీరాన ముందే వచ్చిన సంక్రాంతి శోభ!**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** పచ్చని ప్రకృతికి, రుచికరమైన పూతరేకులకు పుట్టినిల్లైన ఆత్రేయ పురం ఆదివారం రాత్రి సినీ తారల మెరుపులతో ధగధగలాడి పోయింది. 'గోదావరి ట్రోఫీ – ఆత్రేయపురం ఉత్సవం' సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన 'నారి నారి నడుమ మురారి' చిత్ర ఆడియో విడుదల మరియు ట్రైలర్ లాంచ్ వేడుక కనుల పండువగా సాగింది. స్థానిక కాలేజీ గ్రౌండ్స్ జనసంద్రాన్ని తలపించగా, చిత్ర యూనిట్ సందడితో కోనసీమ ముందే సంక్రాంతి సంబరాల్లో మునిగిపోయింది.




**మెరిసిన సినీ తారలు.. అదిరిన ట్రైలర్!**

యంగ్ హీరో శర్వానంద్, అందాల భామలు సంయుక్త మీనన్, సాక్షి వైద్యలు వేదికపై మెరవడంతో అభిమానుల కేరింతలతో గ్రౌండ్ హోరెత్తిపోయింది. ఈసందర్భంగా విడుదల చేసిన చిత్ర ట్రైలర్‌కు ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందన లభించింది. పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి బరిలో నిలవబోతున్నట్లు చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేసింది.

**ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభం** ఈ మెగా ఈవెంట్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. "ఇలాంటి భారీ సినీ వేడుక ఆత్రేయపురంలో జరగడం ఆనందంగా ఉంది. ఈ ఈవెంట్‌తో కొత్తపేట నియోజకవర్గంలో ముందే సం క్రాంతి శోభ వచ్చేసి ంది. సినిమా పెద్ద విజయం సాధించి చిత్ర యూని ట్‌కు పేరు తీసుకు రావాలి" అని ఆకాంక్షించారు.

**ఉర్రూతలూగించిన మ్యూజికల్ నైట్**

ప్రముఖ గాయని మాళవిక తన గళంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయగా, సీనియర్ యాంకర్ ఉదయభాను, మృదుల తమదైన శైలిలో వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తూ కార్యక్రమాన్ని హుషారుగా నడిపించారు. ముఖ్యంగా గోదావరి ప్రజల ఉత్సాహం చూసి చిత్ర యూనిట్ ఫిదా అయిపోయింది.

**కోనసీమ ఆప్యాయత మరువలేం: హీరో శర్వానంద్**

హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. "కోనసీమ ప్రజల ఆదరాభిమానాలు చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. మీ ఆప్యాయత ఎప్పటికీ మరువలేను. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అద్భుతమైన కథతో ఈ సినిమా మీ ముందుకు వస్తోంది.

ప్రతి ఒక్కరూ థియేటర్లలో చూసి ఆశీర్వదించాలి" అని కోరారు. హీరోయిన్లు సంయుక్త మీనన్, సాక్షి వైద్య కూడా గ్రామీణ ప్రాంత ప్రజల స్పందనకు ముగ్ధులయ్యారు.గ్రామీణ ప్రాంతంలో ఇంతటి భారీ ఈవెంట్ జరగడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. వెరసి, ఆత్రేయపురం వీధులన్నీ సినీ కళతో కళకళలాడాయి.

## పేద ప్రజల వైద్యానికి కూటమి ప్రభుత్వం తోడ్పాటు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో పేద ప్రజల వైద్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామానికి చెందిన మార్ని పెద్ద వీర్రాజుకి రూ.44,253, చల్లా మోహిత్ శివమణికి రూ.23,025 ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను అచ్చంపేటలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే చినరాజప్ప అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు చల్లా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయాలకు నెలవు.. ప్రగతి నారి ముగ్గుల పోటీలు

**– కాకినాడ శాంతినగర్‌లో సంక్రాంతి సంబరాలు**

**– మహిళల చైతన్యంతోనే సమాజ పురోగతి**

**: పీఎన్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మంగా**




**కాకినాడ, మేజర్ న్యూస్ :** తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని కాకినాడ శాంతినగర్‌లో పండుగ వాతావరణం ముందే వచ్చేసింది. ప్రగతి నారి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు మహిళల సృజనాత్మకతకు, సంప్రదాయాలకు అద్దం పట్టాయి. ఈ వేడుకలు కేవలం రంగుల కోలాలకే పరిమితం కాకుండా, మహిళా చైతన్యానికి వేదికగా నిలిచాయి.

**అబ్బురపరిచిన రంగవల్లులు..**జిల్లా కార్యదర్శి పి.వరలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తమ ఇంటి ముంగిట వేసే ముగ్గులను కళాఖండాలుగా తీర్చిదిద్ది అందరినీ అబ్బురపరిచారు. రంగురంగుల రంగవల్లులు, గొబ్బెమ్మలతో ఆ ప్రాంతమంతా పండుగ శోభను సంతరించుకుంది. మహిళల్లో దాగి ఉన్న పోటీ తత్వాన్ని వెలికితీస్తూ, మన సంస్కృతిని భావితరాలకు అందించేలా ఈ కార్యక్రమం సాగింది.

**మహిళా సాధికారతే లక్ష్యం..**పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేసిన పీఎన్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వి. మంగా మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ముగ్గులు మన సంస్కృతిలో భాగం. కానీ మహిళలు కేవలం గృహకృత్యాలకే పరిమితం కాకూడదు. సమాజంలో జరుగుతున్న మార్పులను గమనిస్తూ, తమ హక్కుల కోసం పోరాడాలి. మహిళల చైతన్యంతోనే సమాజ పురోగతి సాధ్యమవుతుంది. ఏ కష్టం వచ్చినా ప్రగతి నారి సంఘం (పిఎన్ఎస్) ఎల్లప్పుడూ అండగా ఉంటుంది."అని ఆమె మహిళలకు పిలుపునిచ్చారు.

**ఘనంగా బహుమతుల ప్రదానం..**పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు సంఘం తరపున ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి మహిళలోనూ ఒక సరికొత్త ఉత్సాహం కనిపించింది.ఈ కార్యక్రమంలో శాంతినగర్ కమిటీ సభ్యులు రమ్య, ఏ.లక్ష్మి, ఎం.అక్షయ, దేవి, ప్రసన్న, కృష్ణమ్మ, వెంకటలక్ష్మి, హేమలత, సుజాత, దివ్య మరియు తదితర మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.